# పాల యాదగిరి

"కిట్టూ... గిన్నె తెచ్చుకో" పాల సైకిలు యాదగిరి బైటనుంచి అరిచాడు.

ఆ పిలుపు కోసమే ఎదురుచూస్తున్న కిట్టుగాడు... ఆనందంగా, హడావుడిగా తన బుజ్జిగ్లాసూ... అమ్మ గిన్నీ... పట్టుకుని వీధిలోకి ఉరికాడు.

హేమకి పాలవాడి ముందుకెళ్లటానికి మొహం చెల్లట్లేదు.

అసలీవేళ నుంచి పాలు పోయించుకోవద్దనుకుంది. 'మానెయ్య'మని చెప్పాలని అనుకుంది. కానీ అతనికి డబ్బు ఇచ్చేసి చెప్తే బావుంటుందని

అనిపిస్తోంది.

కిట్టూగాడు- గిన్నె- గ్లాసూ పట్టుకు వెళ్లటం వల్ల- తను యాదగిరి ముందుకెళ్లాల్సి వచ్చినందుకు వాణ్ని తిట్టుకుని... తనని తిట్టుకుని... భర్తని కాదుగానీ... వాళ్ల ఇండస్ట్రీవాళ్లని తిట్టుకుని, మొహమాటంగా పిల్లాడి వెనక్కాలే బైల్దేరింది.

కిట్టూ అప్పటికే తన చిన్న గ్లాసులో పాలు పోయించుకున్నాడు. తాగటానికి సిద్ధపడిపోతున్నాడు.

"హన్నా... కాచుకుని... పంచదార వేసుకు తాగాలి" అంటూ వాడి చేతిలో గ్లాసు లాక్కుంది. కిట్టూ అలకా... కోపం.. ఏడుపూ కలిపి 'బేర్'మంటూ తాండవం చేస్తూ... ఇంట్లోకి వెళ్లిపోయాడు.

"బలే దానివే- పచ్చిపాలు సాయిస్తే.. వొంటికి మంచిది తల్లీ" అన్నాడు యాదగిరి.

"అదలవాటు చేస్తే... పొద్దున్నా రాత్రి పచ్చిపాలే కావాలంటాడు. కాసిన్ని నీళ్లు కలిపి వెచ్చబెట్టి ఉంచి, ఎప్పుడు కావస్తే అప్పుడు కాస్త వేడి చేసి ఇస్తాను" కవరింగ్ చేస్తోంది హేమ.

"ఏమోనమ్మా ఈ ఆడంగుల చిట్కాలు నాకు తెలీదు" అంటూ రెండు గ్లాసుల పాలు ఆమె గిన్నెలో కొల్చి పోశాడు.

"యాదగిరీ... రేపణ్నుంచి... పాలొద్దు" చెప్పలేక చెప్పలేక చెప్తోంది హేమ. "నీకు... 95 రూపాయలు ఇవ్వాలి. ఓ వారం రోజుల్లో ఇస్తాను... ఏమనుకోకు"

యాదగిరి "అదేంటమ్మా డబ్బుదేవుంది... తర్వాతెప్పుడైనా ఇవ్వచ్చు- పొద్దున్న లెగగానే కావాల్సిన... పాలు... వద్దనటం ఏంటి?" అన్నాడు.

హేమ మాట్లాడలేదు.

"చూడమ్మా... మీ ఆయన ఇండస్ట్రీలో పంచేసేవోళ్లకి నేను శానామందికే పాలు పోత్తాను. ఆళ్లకీ జీతాల్రావట్లేదు- నేనూ వాళ్లని డబ్బు ఇమ్మని అడగట్లేదు.. ఈ నెల కాకపోతే... డబ్బులు పైనెలొత్తాయి. అంతేగానీ పోతను మానిపించద్దు" అన్నాడు.

"జీతాలు వచ్చి కుదుటపడటం... ఇప్పట్లో జరుగుతుందనిపించట్లేదు యాదగిరీ... ఈలోగా బాకీలూ అప్పులూ పెరిగిపోతుంటే తలెత్తుకుని తిరగటం కష్టంగా వుంటుంది. నీకు తెలియదులే" అని ఏదేదో చెప్పాలనిపిస్తోంది గానీ మధ్య తరగతి ముసుగులోంచి, బైటకొచ్చి మాట్లాడలేకపోతోంది హేమ.

"మళ్లీ పాలవాడుక పెట్టుకునేప్పుడు... నిన్నే పెట్టుకుంటాను. అయినా నేను మా పుట్టింటికి వెళ్తున్నానులే. అక్కడ మాకు తెల్సున్న వాళ్లింట్లో ఏదో ఫంక్షను ఉంది" కొన్ని అబద్ధాలు కూడా మొదలెట్టింది.

యాదగిరికి అన్నీ తెల్సు- తలపండిన వయస్సు- హేమలాంటి వాళ్లు చెప్పేది కాదనకూడదు. సలహాలు చెప్పకూడదు. వాళ్లని బాధ పెట్టకుండా నమ్మినట్లు నటించాలి.

"సరే అమ్మా మీ మాట కాదన్ను"

యాదగిరి వెళ్లాడు.

హేమ పాలగిన్నెతో లోపలికొచ్చింది. కిట్టు బోర్లాపడుకుని ఏడుస్తున్నాడు- తల్లి వస్తూండటం చూసి సౌండ్ పెంచి తారాస్థాయిలో గోల మొదలెట్టాడు.

"ఏంటి హేమూ... ఆ గోల" నిద్దర్లేచిన భర్త చిరాగ్గా అడిగాడు. మంచం దిగి వచ్చి "ఏం కావాల్రా" అన్నాడు.

"నాలుగు దెబ్బలు- వెధవకి మొండితనం ఎక్కువవుతోంది" అంది.

కిట్టూ నిజంగా దెబ్బలు పడ్డట్టే ఏడుపు ఉధృతం చేశాడు. రాజారాం కిట్టునెత్తుకుని అమ్మని కొట్టించి, గదమాయిస్తే... చల్లబడ్డాడు.

"నాకు పాలు ఇవ్వట్లేదు" అని నేరాలు చెప్పాడు తండ్రితో.

హేమకి కన్నీళ్లు పొంగాయి. పాలవాణ్ని రావద్దందిగానీ... రేపణ్నుంచి వీణ్ని ఎంత ఏడిపించాలో అనే బెంగ గుండెల్లో బరువుగా పడింది.

✦ ✦ ✦

"చాలీ చాలకున్నా... మనం కాస్త తిని... ఇన్ని నీళ్లు తాగి పడుకుంటే తెల్లారిపోతుంది. కిట్టూ గురించే నా భయం... గుప్పెడన్నం తినడానికి సతాయిస్తాడు కానీ... పాల్లేకపోతే తొణకనీయడు... ఏం చేయాలో ఏంటో..."

"ఇంకో పది పధిహేను రోజులు ఈ స్ట్రయిక్ కొనసాగుతుందను కుంటున్నా. మా యూనియన్ లీడర్ ఏమైనా కాంప్రమైజ్ అవద్దని ఉపన్యాసాలు దట్టిస్తున్నాడు"

"వాళ్ల జీవితాలు సేవింగ్స్ బేంక్ ఎకౌంట్స్... ఫిక్స్డ్‌డిపాజిట్ ఇంట్రస్టులూను... నెలవారీ జీతాల బతుకుల గురించి వాళ్లకి ఏం తెలుస్తుంది"

"యూనియన్ ఫండ్‌లోంచి అందరికీ లోన్ ఇస్తారుట... కొన్నాళ్లు గడవచ్చు"

"అది స్ట్రయిక్ మొదలెట్టినప్పణ్నుంచీ అంటున్నాడు... వట్టి మాటలు! మీరేమీ తప్పుగా అనుకోకపోతే ఒక మాట... నేను కొన్నాళ్లు విజయనగరం వెళ్దామనుకుంటున్నాను"

"వెళ్లి...??"

"ఓ నెల్లాళ్లు ఉండి వస్తాను. అప్పటికంతా సెటిలవుతుంది! నాన్నని

వచ్చి తీసుకెళ్లమని ఉత్తరం రాస్తాను"

"ఛ! వద్దు.. ఇలా మాకు జీతాల్లేవూ... పాలకీ బియ్యానికీ ఇబ్బందిగా వుందీ అని రాస్తావా... సిగ్గుకూడానూ...."

"అలా ఎందుకు రాస్తాను- నాకు మాత్రం సిగ్గు కాదా?.'

"......"

"నాకొంట్లో బాలేదు. వాంతులు వికారం... నీరసం... అని రాస్తాను. వేవిళ్లు అనేస్తా" అని నవ్వేసింది భర్త గుండెలమీద తలవాల్చి.

"కొంపదీసి నిజమా" అన్నాడు- భయంగా ఎదకి హత్తుకుంటూ.

"మనం కిట్టూని దర్జాగా పెంచుకుంటే చాల్దా" అంటుంటే.. హేమ కన్నీళ్లతో రాజారాం గుండె తడి అయ్యింది!

✦ ✦ ✦

పక్కింటి దగ్గర పాల యాదగిరి 'పాలమ్మా' అన్న పిలుపు వినపడుతోంది.

కిట్టుకి వినపడకూడదని తలుపేసేసి, వాడికి 'చిట్టీ చిలకమ్మా' పాటలు గట్టిగా చెప్తూ వల్లె వేయిస్తోంది.

తన నటనకి.. ఓవర్ యాక్షన్‌కీ తనకే జాలి వేస్తోంది.

కిట్టు పాటల్లో కలిసిపోతున్నాడు. పాల పిలుపు చెవులకి సోకకుండా ఆపగలదు గానీ.. కడుపులోంచి వాడికి పాలకోసం పిలుపువస్తే వాణ్నెలా పట్టుకోవాలి- మొన్నామధ్య తనకి... వంట్లో బాగోలేనప్పుడు చిట్టుడుకు నీళ్లు, పంచదార కలుపుకుని తాగమన్నారెవరో, పాలంత బలం- అన్నారు. నిజంగానే బలంగా అనిపించింది. ఇవ్వాళ వాడికీ ఆ కొత్తపాలు ఇవ్వాలి... బుర్ర ఆలోచిస్తోంది.

గొంతు రైమ్స్ చెప్తోంది.

యాదగిరి వైపు చెవులు వున్నాయి.

కిట్టుగాడి పాటకూడా శృతి పెరిగిపోతోంది.

షడన్‌గా కాలింగ్ బెల్లు మోగింది. తల్లీ కొడుకులు చేస్తున్న గోలకి బ్రేకు-

విధిలేక తలుపు తీసింది హేమ.

యాదగిరి!!

అమ్మ వెనక్కాలే వచ్చిన కిట్టు యాదగిరిని చూసి....

'పాలు... పాలు... పాలు...' అని గెంతుకుంటూ వెళ్లి తన బుజ్జి గ్లాసు తెచ్చుకున్నాడు.

తల్లి కిట్టూని తిట్టి కొట్టి లోపలికి పంపాలనుకుంది.

అంతకుముందే యాదగిర్ని తిట్టి గెంటెయ్యాలనుకుంది. చిన్న సీసాలో తెచ్చిన పాలు కిట్టుగాడి గ్లాసులో పోశాడు యాదగిరి.

హేమ ఏదో అనబోయింది. యాదగిరి గమనించి....

"సూడమ్మా ఈ పాలు అమ్మడానికి కాదు. కిట్టూబాబుకోసం- మీరు దీనికి డబ్బివ్వక్కర్లేదు- బాబు నా కళ్లముందే తాగితే సాలు! ఇంటికాడ ఈటిని కాసి... పందారేసి తెచ్చాను... కాదనకండి"

హైమ ఏదో చెప్పేలోగా... కిట్టు ఆనందంగా పాలు తాగుతూ యాదగిరి కళ్లలోకి చూసాడు.

ఆ చూపులో భావం చదువుకుని యాదగిరి పులకించిపోయాడు. వీళ్ళిద్దర్నీ చూసి వాళ్ల మనసులో స్వచ్ఛతకి హేమ కళ్లు చెమర్చాయి.